క్లుప్తంగా

జోరుగా ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్లు



రిజిస్ట్రేషన్ కోసం వేలిముద్రలను నమోదు చేస్తున్న అధికారులు

చిప్పగిరి: జగనన్న కాలనీల్లో ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మండలంలో జోరుగా సాగుతోంది. స్థానిక గ్రామ సచివాలయంలో లబ్ధిదారుల వేలిముద్రలు నమోదు చేసి ఇళ్ల స్థలాలను వారి పేరిట రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. తమకు ఇంటి స్థలం ఇచ్చి రిజిస్ట్రేషన్ ద్వారా సర్వహక్కులు కల్పించడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. తహసీల్దార్ లక్ష్మినారాయణ, వీఆర్‌ఓ తిమ్మప్ప, పంచాయతీ కార్యదర్శి నారాయణ స్వామి, డిజిటల్ అసిస్టెంట్ పవన్ తదితరులు రిజిస్ట్రేషన్ కార్యక్రమం చేపట్టారు.

జిల్లాస్థాయి ఖోఖో విజేత వందగల్లు

కోసిగి: ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో మండలంలోని వందగల్లు సచివాలయం జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో ఖోఖో ఫైనల్ పోటీ నిర్వహించారు. జనవరి 31 నుంచి జిల్లా స్థాయి పోటీలు జరుగుతున్నాయి. వందగల్లు, తుగ్గలి జట్ల మధ్య హోరా హోరీగా జరిగిన పోరులో వందగల్లు గెలుపొందింది. ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి క్రీడాకారులు, కోచ్ ధర్మరాజును అభినందించారు. ఈనెల 5న జట్టుకు జిల్లా కలెక్టర్ ప్రశంస పత్రాలు, మెడల్స్, రూ.60వేల నగదు బహుమతి అందజేయనున్నారు. అలాగే గెలుపొందిన క్రీడకారులు ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

గాయత్రీ మాతకు ప్రత్యేక పూజలు

ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వాహకులు రూపామోహన్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

దేవనకొండలో డ్రైడే-ఫ్రైడే

దేవనకొండ: మండలకేంద్రమైన దేవనకొండలో శుక్రవారం డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని మలేరియా అధికారి, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రంగస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎక్కువ రోజులు నీటినిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉన్న చోటే దోమ ఉంటుందని, దోమకాటుకు గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. సూపర్‌వైజర్ హనుమంతమ్మ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

ఆస్పరి: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆస్పరి సీడీపీఓ నిర్మలాదేవి తెలిపారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. ప్రాజెక్టు పరిధిలో ముత్తుకూరు-2, (ఓసీ), బిల్లేకల్లు-2 (ఎస్సీ), నగరూరు-2 (బీసీ-ఏ), యాటకల్లు - (ఓసీ) దేవనకొండ మండలంలో మాచాపురం- (ఓసీ), కె.వెంకటాపురం -(ఓసీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన వారు పూర్తి చేసిన దరఖాస్తును ఈనెల 7వ తేదీ సాయంత్రంలోపు ఆస్పరి ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

5 నుంచి మస్తానయ్య స్వామి ఉరుసు

తుగ్గలి: మండల పరిధిలోని ముక్కెల్లలో ఈ నెల 5వ తేదీ నుంచి మస్తానయ్య స్వామి ఉరుసు నిర్వహించనున్నట్లు శుక్రవారం గ్రామస్తులు తెలిపారు. 5న గంధం, 6న ఉరుసు, 7న జియారత్ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన ఎమ్మార్పీఎస్ మండల కమిటీ సభ్యులు

హొళగుంద: ఎమ్మార్పీఎస్ హొళగుంద మండల నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం తాలూకా అధ్యక్షుడు కత్తి రామాంజనేయులు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా కోగిలతోట వీరేశ్, ఉపాధ్యక్షులుగా తప్పెట మల్లికార్జున, తాలూకా సహాయ కార్యదర్శిగా ఎల్లార్తి మహేశ్, మండల కో-ఆర్డినేటర్‌గా గోవర్ధన తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దళితుల హక్కులను సాధించుకోవడానికి పోరాటాలు తీవ్రతరం చేస్తామని ఎన్నికైన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు దుర్గాప్రసాద్, చిన్నహ్యాట మల్లికార్జున, వీరేశ్, చెన్నప్ప, నాగరాజ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం





మద్దికెరలో సీసీ రోడ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, పత్తికొండలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- మద్దికెరలో రూ.1.17 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం

మద్దికెర: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో ఏపీలో సంక్షేమ రాజ్యం కొనసాగుతోందని, దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన మద్దికెరలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద రూ.67.54 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం-4, రైతు భరోసా కేంద్రం-4 భవనాలు, రూ.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగనన్న రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపడుతుంటే ప్రతిపక్ష పార్టీ నాయకులకు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. మండలంలో నీటి సమస్య పరిష్కారానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామన్నారు. జగనన్న పాలనలో అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయో? లేదో? తెలుసుకొని అందకపోతే పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, ఎంపీపీ అనిత, సర్పంచులు సుహాసిని, విజయుడు, మల్లికార్జున, సలహాదారు ఆంజనేయులు, మార్కెట్‌యార్డు చైర్మన్ పక్కీరప్ప, నాయకులు మల్లికార్జున, శ్రీనివాసులు, తాలూరి వెంకటేశ్వరరెడ్డి, మంజునాథ్‌రెడ్డి, పీఆర్ డీఈ శేషయ్య, ఏఈలు మోహన్‌నాయక్, మయాంక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

పత్తికొండటౌన్: బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా ఉంటుందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శుక్రవారం పత్తికొండలో 6 బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు చొప్పున సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. వడ్డె జగదీశ్, మద్దికెర రమణారెడ్డి, చాకలి రాజు, బోయ మేడికుండ ఆనంద్, కురువ రామకృష్ణ, కురువ రామన్న చెక్కులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిధిలో లేని చికిత్సలకు సీఎం రిలీఫ్‌ఫండ్ సాయం కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం ఆర్థిక సా యం అందిస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అటికెలగుండు బాబురెడ్డి, నలకదొడ్డి కృష్ణ, శభాష్‌పు రం హనుమంతు, జిట్టానాగేశ్ తదితరులు ఉన్నారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాల సంక్షేమం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

గోనెగండ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న పాలనలో అన్ని వర్గాలకు మేలు జరిగిందని, వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీని గెలిపించుకుని మరిన్ని సంక్షేమ పథకాలు అందుకుందామని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని కున్నూరు గ్రామంలో సచివాలయం రూ.40 లక్షలు, ఆర్బీకే రూ.21.80 లక్షలు, హెల్త్ క్లినిక్ సెంటర్ రూ.17.50 లక్షలతో నిర్మించిన భవనాలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయా లు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న సురక్ష ఇలా ఏ కార్యక్రమం అయి నా ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయం అన్నారు. సచివాలయాల ఏర్పాటుతో ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు విస్తృత సేవలు అందుతున్నాయని వివరించారు. రాష్ట్రంలోని మారుమూల పల్లెల్లో సైతం ప్రభుత్వం నాణ్యమైన వైద్య సేవలు అందిస్తుందన్నారు. ఆదోని మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తయితే దగ్గరలోనే అన్ని వ్యాధులకు చికిత్స అందుతుందని చెప్పారు. 104, ఫ్యామిలీ డాక్టర్ ద్వారా రోగుల ఇళ్ల వద్దకే చికిత్స అందిస్తున్నారని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు రాష్ట్ర అభివృద్ధిని, ప్రజా సంక్షేమాన్ని పట్టించుకున్న పపాన పోలేదన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజా సంక్షేమంతో ఆయనకు పనిలేదని విమర్శించారు. ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కష్టపడుతున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో డ్రైనేజీ సమస్య ఉందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా రూ.10లక్షలతో డ్రైనేజీలు నిర్మించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీడీఓ బాబుభాస్కర్, తహసీల్దార్ వేణుగోపాల్, ఈఓఆర్డీ నాగేష్, సెక్రటరీ సోమేష్, సర్పంచ్ కృష్ణవేణి, ఎంపీటీసీ మద్దయ్య, పీఆర్‌డీఈ చంద్రశేఖర్, ఏఈ శివ శంకర్, ఏడీఏ ఖాద్రీ, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేష్, పెద్దిరెడ్డి, శ్రీరామ్ రెడ్డి, ధర్మకారి నాగేశ్వరరావు, కాశీ రెడ్డి, మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో మరిన్ని వైద్య పరీక్షలు



పరికరాల గురించి తెలియజేస్తున్న డాక్టర్ రాగిణి

మద్దికెర: స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు (పీహెచ్‌సీ) ప్రభుత్వం మరిన్ని వైద్య పరికరాలు మంజూరు చేసిందని, వీటి ద్వారా మరిన్ని వైద్య పరీక్షలు చేయడానికి వీలవుతుందని ప్రభుత్వ వైద్యాధికారిణి రాగిణి అన్నారు. శుక్రవారం వైద్యశాలలో పరికరాలను పరిశీలించి వాటి గురించి తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ.. గతంలో రోగులు గళ్ల పరీక్ష చేయించుకోడానికి పత్తికొండ, కర్నూలుకు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం స్థానికంగానే ఆ పరీక్షలు చేసేందుకు వీలు కలిగిందన్నారు. ప్రైవేట్ ల్యాబ్‌ల్లో పరీక్షలు చేయించుకుంటే దాదాపు రూ.2 వేలు ఖర్చవుతుందన్నారు. అలాగే బ్లడ్‌ప్రెజర్, షుగర్, జాండీస్, క్రియాటిన్ పరీక్షలు కూడా ఉచితంగా చేస్తారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



హత్తిబెళగల్‌లో పర్యటిస్తున్న వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి

ఆలూరు రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి సూచించారు. ఆయన శుక్రవారం మండలంలోని హత్తిబెళగల్, కురువళ్లి, అగ్రహారం గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు ఏర్పడ్డాయన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ఇంటివద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని వివరించారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం లభించిందన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మోసపూరిత హామీలను ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, వారి కుట్రలను ప్రజలను తెలియజేయాలని సూచించారు. మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చిన్న ఈరన్న, ఎంపీటీసీ దేవరాజు, చిప్పగిరి మండల కన్వీనర్ మారయ్య, నాయకులు వీరేష్, శివ,రామాంజినేయులు, నాగేంద్ర, మహబూబ్ బాషా తదితరులు ఉన్నారు.

నేటి సమావేశానికి తరలిరావాలి

ఆలూరు: స్థానిక ఉమా కల్యాణ మండపంలో శనివారం నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమావేశానికి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని విరూపాక్షి పిలుపునిచ్చారు. ఆలూరు ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆయన మాట్లాడుతూ.. సమావేశం ఉదయం 10:30 గంటలకు ప్రారంభమవుతుందని, ముఖ్యఅతిథిగా పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి హాజరవుతారని చెప్పారు.

నేడు బొందిమడుగులలో ఎమ్మెల్యే పర్యటన

తుగ్గలి: మండల పరిధిలోని బొందిమడుగులలో శనివారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ, సచివాలయ మండల అధ్యక్షులు జిట్టా నాగేష్‌యాదవ్, హనుమంతు తెలిపారు. గ్రామంలో రూ.42.30 లక్షలతో నూతనంగా నిర్మించిన ఆర్‌బీకే, హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామంలో గత నెల 30వ తేదీ రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కిరాణా దుకాణంలోని సరుకులు, నగదు కాలి బూడిదై ఆస్తి నష్టం జరిగిన విషయం తెలిసిందే. వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయ కర్త బుసినె విరుపాక్షి సూచనతో ఆయన సోదరుడు వెంకటేష్ శుక్రవారం హలిగేర గ్రామానికి వచ్చి బాధితురాలు రోసమ్మ కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం తరఫున సాయం అందేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం గ్రామంలో ఆంజనేయ స్వామి, నారాయణ తాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు యువరాజు, వెంకటేష్, లక్ష్మీనారాయణ, ప్రకాష్, అంజినయ్య, నాయుడు ఉన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కృష్ణగిరి: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని కృష్ణగిరి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం ఉదయం తమకు అందిన సమాచారం మేరకు ఎరుకలచెరువు గ్రామ సమీపాన గుండ్ల మల్లాపురం గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు వద్దకు వెళ్లగా పోలీసు వాహనాన్ని చూసి స్కూటర్ (ఏపీ 21 ఏకే 0606), ఆటో (ఏపీ 22 డబ్ల్యూ 8238)లోని వ్యక్తులు తప్పించుకుని పరారయ్యేందుకు ప్రయత్నించడంతో వెంబడించి పట్టుకున్నట్లు చెప్పారు. స్కూటరిస్ట్ కృష్ణగిరి చెందిన ఎరుకల మునిస్వామి, ఆటో డ్రైవర్ ఎరుకల కంబగిరిని విచారించగా కర్ణాటక మద్యం బాక్సులను ఎరుకలచెరువు గ్రామానికి చెందిన శ్రీనివాసులుకు, రామకృష్ణాపురానికి చెందిన లింగన్నకు ఇచ్చేందుకు తీసుకెళుతున్నట్లు తెలిసిందన్నారు. ఆ నలుగురిపై కేసు నమోదు చేసి 5 బాక్సుల మద్యాన్ని, స్కూటర్, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కురుబలకు రాజకీయ ప్రాధాన్యతనివ్వాలి



మాట్లాడుతున్న శశికళ, కృష్ణమోహన్

ఆలూరు: మాదారి, మాదాసి కురుబ కులస్తులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ, కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. వారు శుక్రవారం ఆలూరులోని నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయ పార్టీలు కురుబలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని, అలాంటి వారికి తమ సత్తా చూపిస్తామన్నారు. కురుబలకు సముచిత స్థానం కల్పించే పార్టీకే తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో రెండు ఎమ్మెల్యే, ఒక ఎంపీ స్థానం కురువలకు కేటాయించాలని కోరారు. రాష్ట్ర మాదాసి, మాదారి కురుబ సంఘం నాయకులు బసప్ప, మల్లికార్జున, నాగప్ప, తాతప్ప, బీరప్ప, గర్జన్న, లక్ష్మన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

ఆలూరు: వాటర్ షెడ్డు పథకం పనుల్లో అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆలూరులోని సీఎల్ఆర్సీ భవనం ఆవరణలో డబ్ల్యూసీసీ సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. 2022-23 సంవత్సరంలో రూ.5.97 కోట్ల నిధులు వెచ్చించి పనులు చేసినట్లు చెప్పారు. ఇందులో ఎన్ఆర్ఎం కింద రూ.3.38 కోట్లతో 294 పనులు, పీఎస్ఐ కింద రూ.2.11 కోట్లతో 1,164 పనులు, ఈపీఏ ద్వారా రూ.47 లక్షలతో 61 పనులు చేశామన్నారు. చేసిన పనుల్లో రికవరీ కింద రూ.10,500 రాగా రూ.3 వేలు జరిమానా వేశామన్నారు. అడిషనల్ పీడీ మాధవీలత, పీఎం సునీల్‌కుమార్, ఎస్టీఎం లోకేష్ రెడ్డి, ఎస్ఆర్పీ మల్లికార్జున, డీపీసీ భాస్కర్, ఏపీడీ పద్మావతి, ప్రాజెక్ట్ ఆఫీసర్ వలీబేగ్ తదితరులు ఉన్నారు.

జన ఔషధిని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న కేడీసీసీ చైర్‌పర్సన్ విజయమనోహరి

మద్దికెర: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన ఔషధాలు అందజేస్తున్నాయని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఉమ్మడి జిల్లాల కేంద్ర సహకార (కేడీసీసీ) బ్యాంకు చైర్‌పర్సన్ విజయమనోహరి అన్నారు. శుక్రవారం మద్దికెరలోని సహకార సంఘం ఆవరణలో జనరిక్ ఔషధ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్య సమస్యలతో బాధపడే వారికి తక్కువ ధరకే మందులు అందించేలా జన ఔషధి దుకాణం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే సంఘం ద్వారా తక్కువ వడ్డీకే బంగారం, వ్యాపారులకు రుణాలు అందిస్తున్నామని కొత్తగా హౌసింగ్, వాహనాలకు రుణాలు అందజేస్తున్నామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధ్యక్షుడు శాంతన్న, సుబ్బయ్య, సహకార సంఘం జిల్లా సీఈఓ రామాంజనేయులు, సీఈఓ నాగరాజు, ఎర్రిస్వామి, వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు ఆంజనేయులు, రామకృష్ణ, నాయకులు కృష్ణ, రామలింగారెడ్డి పాల్గొన్నారు.

92 శాతం పింఛన్ల పంపిణీ



నేమకల్లులో పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ మౌలా

చిప్పగిరి: మండలంలోని అయాగ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం రెండవ రోజు కొనసాగింది. ఉదయాన్నే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వేలిముద్రలు నమోదు చేసుకుని పింఛన్ సొమ్ము అందించారు. పింఛన్ల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన బాధలు తప్పాయని లబ్ధిదారులు పేర్కొంటూ ఇంటివద్దకే సొమ్ము అందిస్తున్న ప్రభుత్వాన్ని అభినందిస్తున్నారు. మండలంలో మొత్తం పింఛన్‌దారులు 3,552 మందికిగాను రూ.97,76,250 చెల్లించామని, ఇప్పటివరకు 92 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యిందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు.

హొళగుంద: మండలంలో రెండవ రోజు పింఛన్ల పంపిణీ 90 శాతం పూర్తయ్యింది. మొత్తం 6,146 మంది పింఛనుదారులుండగా శుక్రవారం సాయంత్రానికి 5,556 మందికి నగదు అందజేశారు. ఇంటి వద్దకే పింఛన్ సొమ్ము అందించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

బడి మారింది

ఆలూరు రూరల్: ఆలూరు మండలం తుంబళబీడు గ్రామ పంచాయతీలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల సకల సౌకర్యాలతో ఆదర్శంగా నిలుస్తోంది. గతంలో పాఠశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. వర్షం వస్తే పాఠశాల ఆవరణం నీటితో నిండిపోయేది. భవనం పెచ్చులూడి ఎప్పుడు పడతాయో తెలియని పరిస్థితి. అలాంటి పాఠశాల వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూపురేఖలు మారిపోయాయి. నాడు-నేడు పథకం ద్వారా రూ.16.50 లక్షలు వెచ్చించి పాఠశాల భవనాన్ని ఆధునికీకరించారు. విద్యార్థులు కూర్చునేందుకు బెంచీలు, బల్లలు. గ్రీన్ చాక్ బోర్డులు, తాగునీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు వంటి మౌలిక వసతులు కల్పించారు. ప్రస్తుతం ఆ పాఠశాలలో 1-5 తరగతులు కలిపి 155 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గతంలో పాఠశాలకు రావాలంటే విద్యార్థులు మారాం చేసేవారు. బడి రూపురేఖలు మారి ఆహ్లాదకరంగా ఉండడంతో విద్యార్థులు ఉల్లాసంగా పాఠశాలకు వచ్చి పాఠాలు వింటున్నారు.

గ్రామం	: తుంబళబీడు
పాఠశాల	: ఎంపీపీ స్కూల్
విద్యార్థుల సంఖ్య	: 155
నాడు-నేడు ద్వారా ఖర్చుచేసిన నిధులు	: రూ.16.50 లక్షలు



తుంబళబీడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల



డెస్కులపై కూర్చొని చదువుకుంటున్న విద్యార్థులు



పాఠశాలలో రన్నింగ్ వాటర్ సౌకర్యంతో మరుగుదొడ్లు

వంద క్వింటాళ్ల కందుల కొనుగోలు



సాకిబండలో కందులను పరిశీలిస్తున్న ఏఓ శివశంకర్

హాలహర్వి: బహిరంగ మార్కెట్ ధర ప్రకారం రైతుల నుంచి వంద క్వింటాళ్ల కందులను కొనుగోలు చేసినట్లు ఏఓ శివశంకర్ తెలిపారు. ఆయన శుక్రవారం మండలంలోని బేవినహాళ్, చాకిబండ, హాలహర్వి, కామినహాళ్, శ్రీధర్‌హాళ్ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం రైతుల పొలాలను పరిశీలించారు. రైతులు ఖరీఫ్ సీజన్‌లో పండించిన కంది దిగుబడులను రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ మార్కెట్ ధరకే కొనుగోలు చేస్తుందన్నారు. రైతు భరోసా కేంద్రాల వద్ద కందులను కొనుగోలు చేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలో 140 హెక్టార్లలో కందులు సాగయ్యాయని చెప్పారు. డీసీఎంఎస్, సివిల్ సప్లై స్టాఫ్, టి.చాకిబండ రైతుల నుంచి దాదాపు వంద క్వింటాళ్ల కందులు కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఆర్బీకే సిబ్బంది వెంట ఉన్నారు.

చిరుత దాడిలో మేక మృతి

కోసిగి: స్థానిక రంగప్ప గట్టు సమీపంలోని తమ్మనగేని కృష్ణకు చెందిన గొర్రెల మందపై గురువారం రాత్రి చిరుత దాడి చేసింది.ఒక మేకను నోట కరచుకుని పరుగు తీస్తుండగా కుక్కలు మొరగడంతో గొర్రెల కాపరులు అప్రమత్తమై శబ్దం చేశారు. మేకను వదిలేసి చిరుత పరారైంది. అప్పటికే మేక చనిపోయింది. ఫారెస్ట్ అధికారులకు విషయం తెలియజేయడంతో పశువైద్యాధికారి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో మేక కళేబరానికి పోస్టుమార్టం చేశారు. పరిహారం అందేలా చూస్తామని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అనురాధ తెలిపారు.

పేదల ఆరోగ్యానికి సు'రక్ష'



మొలగవల్లి కొట్టాలలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్



జొన్నగిరి సచివాలయం-2లో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్



వెల్దుర్తిలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ రామగిడ్డయ్య

వెల్దుర్తి(కృష్ణగిరి): గ్రామాల్లోని ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి మెరుగైన వైద్యచికిత్స అందించడం ద్వారా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు ప్రజారోగ్య కేంద్రాలుగా నడుస్తున్నాయని డీఎంహెచ్ఓ రామగిడ్డయ్య అన్నారు. ఆయన శుక్రవారం వెల్దుర్తి ఎంపీపీ మెయిన్ స్కూల్‌లో ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక ఆధ్వర్యంలో నిర్వహించిన సురక్ష-2 వైద్య శిబిరాన్ని పరిశీలించారు. క్యాంపుకు వచ్చిన వారి వివరాలు సేకరిస్తున్న సచివాలయ ఉద్యోగులు, బీపీ, షుగరు, రక్త పరీక్షలు, ఈసీజీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ ఆరోగ్య, ఆశా సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య సేవలందిస్తున్న స్పెషలిస్టు వైద్యులు డాక్టర్ మౌనిక, డాక్టర్ అశ్విని, పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ భువనతేజ, డాక్టర్ ప్రతిభ, కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాలిస్టు డాక్టర్ కవితల సేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పలువురికి మందులు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న, దేవరాజు, పీహెచ్‌సీ సిబ్బంది వెంట ఉన్నారు. క్యాంపులో 320 మంది వైద్య సేవలు పొందినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆలూరు రూరల్: మండలంలోని మొలవల్లి కొట్టాల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమంలో భాగంగా రోగులకు వైద్య పరీక్షలు చేసినట్లు మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ రవి చెప్పారు. 80 మంది వృద్ధులు, గర్భిణులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఎంపీహెచ్‌ఓ అంద్రూస్, ఫార్మసిస్టు రమణ, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

తుగ్గలి: జొన్నగిరి సచివాలయం-2లో వైద్యాధికారిణి హరిత ఆధ్వర్యంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. స్పెషలిస్టు వైద్యులు తన్వీర్ అహ్మద్, రాఘవరాయుడు, పగిడిరాయి పీహెచ్‌సీ వైద్యాధికారిణి హరిత దాదాపు 310 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హొళగుంద: హెబ్బటం గ్రామంలో శుక్రవారం సర్పంచ్ చలువాది కృష్ణవేణి, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సురక్ష వైద్య శిబిరంలో గజ్జహళ్లి పీహెచ్‌సీ వైద్యురాలు పెద్ద రాధ, కర్నూలు వైద్యులు హరీష్‌రెడ్డి, శివకేశవ రెడ్డి ప్రజలకు వైద్య సేవలందించారు. బీపీ, షుగర్, హెచ్‌బీ లాంటి సాధారణ పరీక్షలతో పాటు అన్ని రకాల జబ్బులున్న వారిని పరీక్షించి ఆరోగ్య జాగ్రత్తలు చెప్పి ఉచితంగా మందులను అందించారు. శిబిరంలో 411 మందికి వైద్య సేవలందించారు. ఒకరిని మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేసినట్లు డాక్టర్లు తెలిపారు.



హెబ్బటంలో వైద్యసేవలందిస్తున్న దృశ్యం